# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 09-10-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- యువత నిరంతరం కొత్త నైపుణ్యాలను సంపాదించుకుంటూ.. సామర్థ్యాలను మెరుగుపరుచుకోవాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు.

- దేశ టెలికాం, డిజిటల్ రంగాలలో గత దశాబ్ద కాలంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయని కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా అన్నారు.

- శాశ్వత కార్మిక ధృవీకరణ (PERM)కు సంబంధించి అమెరికా ప్రకటించిన చర్యలను ఉపసంహరించుకుని ఇరు దేశాల ఉమ్మడి ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని భారత్ స్పష్టం చేసింది.

- ఐదు మ్యాచ్‌ల టీ-20 సిరీస్‌లో భాగంగా భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య రాంచీ వేదికగా రెండవ క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది.

=====================

సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో యువత నిరంతరం కొత్త నైపుణ్యాలను సంపాదించుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. 48వ వరల్డ్ స్కిల్స్ కాంపిటీషన్ షాంఘై-2026లో పాల్గొన్న టీమ్ ఇండియా ప్రతినిధులతో ఈరోజు ఢిల్లీలోని ప్రధానమంత్రి నివాసంలో నరేంద్ర మోదీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... ప్రపంచ వేదికపై భారతదేశానికి ప్రాతినిధ్యం వహించినందుకు టీమ్ ఇండియా ప్రతినిధులను అభినందించారు. వారు నైపుణ్యాభివృద్ధికి రాయబారులుగా మారాలని పేర్కొన్నారు. సామర్థ్యాలను మెరుగుపరచుకుంటూ.. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను స్వీకరించాలన్నారు. నైపుణ్య శిక్షణా సంస్థలు ఐఐటీలు, ఐఐఎంల కంటే ఏమాత్రం తక్కువ కాదని స్పష్టం చేశారు. అంతర్జాతీయ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, వారి అనుభవాలు, సూచనల ద్వారా భారతదేశ నైపుణ్య శిక్షణా వ్యవస్థను

మెరుగుపరచడానికి దోహదపడాలని ఆయన కోరారు. నైపుణ్యం కలిగిన మానవ వనరులకు భారతదేశాన్ని ప్రపంచ కేంద్రంగా నిలపడానికి యువత, ప్రభుత్వం, శిక్షణా సంస్థల సమన్వయం ఎంతో అవసరం అని ప్రధానమంత్రి అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

దేశ టెలికాం, డిజిటల్ రంగాలలో గత దశాబ్ద కాలంలో గణనీయమైన మార్పు చోటు చేసుకున్నాయని కేంద్ర సమాచార శాఖ మంత్రి జ్యోతి రాదిత్య సింధియా అన్నారు. న్యూఢిల్లీలో జరుగుతున్న `ఇండియా మొబైల్ కాంగ్రెస్` 10వ ఎడిషన్‌లో కేంద్రమంత్రి ఈరోజు ప్రసంగిస్తూ... ప్రపంచంలోని స్వదేశీ 4జీ సేవలను అభివృద్ధి చేసిన దేశాల సరసన భారత్ కూడా నిలిచ్చిందన్నారు. 2030 నాటికి భారతదేశం 5జీ వినియోగదారుల సంఖ్యను 55 కోట్ల నుండి వంద కోట్లకు రెట్టింపు చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. అలాగే భారతదేశం ఏ రంగంలోనూ గుత్తాధిపత్యాన్ని అనుమతించదని జ్యోతిరాదిత్య సింధియా స్పష్టం చేశారు. నిర్దేశించిన భద్రతా నిబంధనలు పాటించిన తరువాతనే ఆపరేటర్లకు సేవలను ప్రారంభించేందుకు అనుమతి ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. వినియోగదారులకు పలు రకాల సేవలను అందించడమే ప్రభుత్వ బాధ్యత అని కేంద్రమంత్రి వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

టెరిటోరియల్ ఆర్మీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాజీ సైనికులు, వారి కుటుంబాలకు అభినందనలు తెలిపారు. టెరిటోరియల్ ఆర్మీ సేవలు `నాగరిక్ భీ, సైనిక్ భీ` నినాదానికి స్ఫూర్తి నిస్తున్నాయని సామాజిక మాధ్యమ పోస్టులో రక్షణ మంత్రి ఈరోజు పేర్కొన్నారు. అసాధారణమైన నిబద్ధతతో దేశానికి సేవ చేయాలనే సాధారణ పౌరుల సంకల్పానికి ఇది ప్రతిరూపంగా నిలుస్తుందని అన్నారు. సరిహద్దుల పరిరక్షణ నుండి విపత్తు సహాయం, దేశ నిర్మాణం వరకు టెరిటోరియల్ ఆర్మీ సైనికుల ధైర్యం, అంకితభావం, నిస్వార్థ సేవ వెలకట్టలేనిదన్నారు. దేశ సేవ పట్ల వారి అచంచలమైన నిబద్ధతకు, బలమైన ఆత్మనిర్భర భారతదేశం కోసం వారు చేస్తున్న అమూల్యమైన కృషి అభినందనీయమని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

ఇటీవల శాశ్వత కార్మిక ధృవీకరణ (PERM)కు సంబంధించి అమెరికా ప్రకటించిన చర్యలను ఉపసంహరించుకుని ఇరు దేశాల ఉమ్మడి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని భారత్ స్పష్టం చేసింది. విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఈరోజు న్యూఢిల్లీలో పాత్రికేయులతో మాట్లాడుతూ... ప్రతిభావంతుల బదిలీ భారత, అమెరికా ఆర్థిక వ్యవస్థలకు విలువను చేకూరుస్తుందన్నారు. ఇది భారతీయులకు అవకాశాలను కల్పిస్తున్నప్పటికీ... అత్యాధునిక ప్రతిభ, ఆవిష్కరణలు, పరిశోధన, ఉత్పాదకత, పోటీతత్వం, ఉద్యోగ కల్పన వంటి వాటికి ప్రాప్యతను అందించడం ద్వారా అమెరికా కంపెనీలకు కూడా సమానంగా ప్రయోజనం చేకూరుస్తుందని ఆయన స్పష్టం చేశారు. అమెరికాలో వాటాదారుల సంపదను సృష్టించడమే కాకుండా, ఇది రెండు దేశాలకు అపారమైన పరస్పర ప్రయోజనం చేకూర్చుతుందని రణధీర్ జైస్వాల్ పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = =

రేపు జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) తలపెట్టిన నిరసన ప్రదర్శనకు ఢిల్లీ పోలీసులు అనుమతి నిరాకరించారు. ఢిల్లీ పోలీస్ జాయింట్ కమిషనర్ నూపుర్ ప్రసాద్ ఈరోజు న్యూఢిల్లీలో పాత్రికేయులతో మాట్లాడుతూ... జంతర్ మంతర్ వద్ద నిరసనలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించడానికి అనుమతి కోరుతూ దరఖాస్తులను కనీసం 10 రోజుల ముందుగా సమర్పించాలని తెలిపారు. గతంలో కూడా ఆ ప్రదేశంలో నిరసన ప్రదర్శన చేయడానికి సీజేపీకి అనుమతి లభించినప్పటికీ, వారు నిర్దేశించిన మార్గదర్శకాలను, ఇచ్చిన హామీలను పాటించడంలో విఫలమయ్యారని

ఆమె పేర్కొన్నారు. అలాగే న్యూఢిల్లీ ప్రాంతంలో నెలకొన్న శాంతిభద్రతల పరిస్థితి, ప్రజా భద్రత, ట్రాఫిక్ నిబంధనలను దృష్టిలో ఉంచుకుని అనుమతి నిరాకరించే నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రజా భద్రత, శాంతి భద్రతలను కాపాడేందుకు అవసరమైన ఆంక్షలు విధిస్తూ.. భారతీయ నాగరిక్ సురక్షా సంహితలోని సెక్షన్ 163 కింద ఆ ప్రాంతంలో ప్రస్తుతం నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నాయని తెలిపారు. ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఢిల్లీ పోలీస్ జాయింట్ కమిషనర్ హెచ్చరించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

న్యూఢిల్లీలో రేపు జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిరసనల చేపట్టనున్న నేపథ్యంలో న్యూఢిల్లీ రైల్వే స్టేషన్, హజ్రత్ నిజాముద్దీన్ స్టేషన్లకు వచ్చి పోయే రైళ్ల సర్వీసులు అన్నింటినీ రద్దు చేస్తున్నట్లు భారతీయ రైల్వే ఈరోజు ఒక ప్రకటన విడుదల చేసింది. రేపు ఉదయం 4 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్య ఆయా స్టేషన్లకు రైల్వే సర్వీసులు నడవవని స్పష్టం చేసింది. ఈ స్టేషన్ల నుంచి మొత్తం 10 గంటల పాటు రైళ్ల రాకపోకలను రద్దు చేస్తున్నట్లు తెలిపింది. మరో వైపు న్యూఢిల్లోని 57 మెట్రో స్టేషన్లు ఈరోజు రాత్రి 9 గంటల నుంచి రేపటి వరకు మూసి వేస్తున్నట్లు ఆ ప్రకటనలో డీఎంఆర్సీ వివరించింది. జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ నిరసనల కారణంగా.. మెట్రో స్టేషన్ల ఎంట్రన్స్, ఎగ్జిట్స్ మూసి వేయాలని డీఎంఆర్సీకి ఢిల్లీ పోలీసులు లేఖ రాయడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు డీఎంఆర్సీ వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో బలమైన పరిశోధనా సంస్కృతికి డిజిటల్ ఆరోగ్య వనరులు కీలక సాధనాలని కేంద్ర ఆరోగ్య శాఖా కార్యదర్శి పుణ్య సలీల శ్రీవాస్తవ అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన `డిజిటల్ ఆరోగ్య వనరులపై 5వ జాతీయ శిక్షణ-కమ్-సదస్సు`లో ఆమె ప్రసంగిస్తూ... విజ్ఞానం, సమాచార లభ్యతను సులభతరం చేయడంలోనూ, వైద్య విద్య, పరిశోధన, ఆరోగ్య సంరక్షణ అందించే పునాదులను బలోపేతం చేయడంలోనూ జాతీయ వైద్య గ్రంథాలయం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. వైద్య కళాశాలలను, ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాల్లో డిజిటల్ వైద్య వనరులను విస్తరించాలని పిలుపునిచ్చారు. సంస్థల మధ్య జ్ఞాన మార్పిడిని సులభతరం చేయడం, మంచి వైద్య గ్రంథాలయ పద్ధతులను అవలంబించడం ద్వారా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు మార్గదర్శకత్వం, మద్దతును అందించడం అవసరం అని పుణ్య సలీల శ్రీవాస్తవ స్పష్టం చేస్తూ...

(వాయిస్ 22 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

రేపు కేరళం, మాహే, తమిళనాడు, పుదుచ్చేరి, కారైకల్ ప్రాంతాలలో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎమ్‌డి) తెలిపింది. అలాగే దక్షిణ అంతర్గత కర్ణాటక, ఉత్తరాఖండ్‌లలో కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. లక్షద్వీప్, బీహార్, ఆంధ్రప్రదేశ్, తూర్పు మధ్యప్రదేశ్, జార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, సిక్కింలలో ఈరోజు, రేపు ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని ఐఎండి తెలిపింది. ఇదిలా ఉండగా.. కొంకణ్, గోవాలో రేపు వేడి, తేమతో కూడిన వాతావరణం ఉంటుందని వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = =

భారత్, వెస్టిండీస్ పురుష జట్ల మధ్య ఐదు మ్యాచ్ ల టీ-20 క్రికెట్ సిరీస్‌లో భాగంగా రెండవ మ్యాచ్ ఈరోజు రాంచీ వేదికగా జరుగుతోంది. తొలుత టాస్ గెలిచిన వెస్టిండీస్ ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన భారత్ 17 ఓవర్లు పూర్తయ్యేసరికి 4 వికెట్లు నష్టపోయి 194 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = =